ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



యల్లపువానిపాలెంలో ప్రభుత్వ పథకాల పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం: యల్లపువాని పాలెంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యల గురించి ఆరాతీశారు. ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఏవిధంగా అందుతున్నాయో ఆరాతీశారు. స్థానిక ప్రజలు రోడ్లు, కాల్వలు బాగో లేవని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అధికారులతో మాట్లాడి వెంటనే అక్కడి పరిస్థితి సమీక్షించాలని ఆదేశించారు. యల్లపువానిపాలెంలో అధికంగా నిధులు వెచ్చించి పలు రహదారులు కాల్వలు వేయించామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల వివరాల ప్రతులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పేదలకు మేలు చేకూరుస్తున్నాయన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. భీమిలి, పశ్చిమ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అయితంశెట్టి కోటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, నర్సింగరావు, విజయ్, జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు, ఏపీడీ శ్రీరామ్, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

దీపావళి కోలాహలం



స్టాళ్లను పరిశీలిస్తున్న డీసీపీ ఆనంద్‌రెడ్డి



ఎన్‌ఏడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్

విశాఖ విద్య: దీపావళి పండగ సందడితో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ఎన్‌ఏడీలోని అల్ఫా హోటల్ వెనుక దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పటాసులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు పరిసర కాలనీల ప్రజలు తరలిరావడంతో ఎన్‌ఏడీ సెంటర్‌లో కోలాహలంగా కనిపించింది.

బాణసంచా స్టాళ్లను పరిశీలించిన డీసీపీ

ఎన్‌ఏడీ ఏరియాలో ఏర్పాటు చేసిన దీపావళి సామగ్రి విక్రయాల స్టాళ్లను శనివారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు(డీసీపీ–2) కె.ఆనందరెడ్డి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎన్‌ఏడీ అల్ఫా హోటల్ వెనుక 12 స్టాళ్ల ఏర్పాటుకు మాత్రమే అనుమతులు తీసుకోగా, అదనంగా మరో రెండు స్టాల్స్‌లో విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏసీపీ ఎ.నర్సింహమూర్తి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. అధికారుల వెంట ట్రాఫిక్ సీఐ అప్పారావు తదితరులు ఉన్నారు.



గోపాలపట్నంలో బాణసంచా స్టాళ్ల వద్ద గుమిగూడిన కొనుగోలుదారులు

జోరుగా బాణసంచా విక్రయాలు

గోపాలపట్నం: గోపాలపట్నంలో టపాసుల దుకాణాల్లో కొనుగోలు దారులతో రద్దీ నెలకొంది. గోపాలపట్నంలో 31 దుకాణాలకు అనుమతులు వచ్చాయి. అలాగే అన్ని అనుమతులతో కొత్తపాలెంలో 2 దుకాణాల తెరిచారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు దుకాణాల్లో అమ్మకాలు ముగించాలని పోలీసులు చెబుతున్నారు. గోపాలపట్నంలో పోలీసులు భద్రతపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

గుల్లలపాలెం వాకింగ్ పార్కులో..

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు మైదానంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా స్టాళ్ల వద్ద జనం సందడి చేశారు.

డిప్యూటీ మేయర్ పరామర్శ



వరలక్ష్మిని పరామర్శిస్తున్న జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: ఇటీవల ప్రమాదంలో గాయపడి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వరలక్ష్మిని శనివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న ఆయన.. మెరుగైన చికిత్స అందించేలా చొరవ తీసుకోవాలని వైద్యులను కోరారు. వరలక్ష్మి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మహిళలు సీఈవో స్థాయికి ఎదగాలి



కోరమాండల్ అధికారిని అభినందిస్తున్న కార్పొరేటర్ సుధ, బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం: మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం వద్ద శనివారం మహిళలకు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ,ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమం నిర్వహించారు.కోరమాండల్ సంస్థ , ఐకా లెర్నింగ్ టీం ప్రాజెక్ట్ సహకారంతో నిర్వహించిన భవిష్యత్ సీఈవోలు మహిళలే అనే కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ,ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం అనే కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు,స్వచ్ఛంద సంస్థలతో మాట్లాడి మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ ట్రెనింగ్ ఇప్పించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎంపికైన మహిళలకు ట్రెనింగ్ ఇవ్వడంతో వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందజేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలోని జీసస్ కంఫర్ట్ హోమ్‌లోని అనాథబాలలకు భగవాన్ పితామహ పత్రిజీ అవతరణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు చేతుల మీదుగా సరకులను జీసస్ కంఫర్ట్ హోమ్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పితామహ పత్రిజీ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ సభ్యులు శివగణేష్, డాక్టర్ భాగ్య, సత్యనారాయణరెడ్డి, పద్మ, భాను, సన్‌రైజ్ వ్యవస్థాపకులు ఈశ్వరరావు, భాను పర్యవేక్షణలో సరుకులు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వరసల మహేష్,నాయకులు ఆదారి హరీష్, బాల ప్రసాద్, గంగరాజు, కిషోర్, పండు, నూకరాజు, రమేష్, ట్రస్ట్ సభ్యులు, జేసీ హోమ్ సభ్యులు పాల్గొన్నారు.

59వ వార్డులో జోరుగా ఓటరు సర్వే



ఓటర్ సర్వేలో పాల్గొన్న బీఎల్‌ఏలు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం,కొత్త నక్కవానిపాలెం ప్రాంతాల్లో శనివారం ఉదయం ఓటరు సర్వే చురుగ్గా సాగింది. ఆయా ప్రాంత బీఎల్‌ఏలు తమ పరిధిలో గల నివాసాలకు వెళ్లి జాబితాలో ఉన్న వారు ఆ ఇంట్లో ఉన్నారా లేదా అన్న దానిపై పరిశీలించారు.అలాగే చిరునామా మారిన వారు, ఉపాధి నిమిత్తం ఆ ప్రాంతాలను విడిచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లిన వారి వివరాలను బీఎల్‌ఏలు సేకరించారు.

డాక్‌యార్డులో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేవీ అధికారులు

సింథియా: నేవీ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా నేవల్ డాక్‌యార్డ్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించారు. దీన్ని ఆడ్మిరల్ సూపరింటెండెంట్ అడ్మిరల్ ఆర్. విజయ్‌శేఖర్ సమక్షంలో ఈస్టర్న్ నేవల్ కమాండ్ సర్జన్ అడ్మిరల్ ఆర్. రవి ప్రారంభించారు. 219 మంది డాక్‌యార్డ్ స్కూల్ అప్రెంటిస్‌లతో పాటు సర్వీస్, డిఫెన్స్ సివిలియన్ సిబ్బంది రక్తాన్ని దానం చేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న స్థానిక యువత



వెంకన్నపాలెం కొండ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో షెడ్ నిర్మాణానికి వేసిన పునాదులు

మల్కాపురం: తన ఇంటి వెనుకున్న ప్రభుత్వ స్థలంపై ఓ వ్యక్తి కన్ను పడింది. దానిలో కార్ షెడ్ వేసేందుకు సన్నాహాలు చేశాడు. స్థానిక యువత అడ్డుకోవడంతో ఆ పనులను తాత్కాలికంగా నిలిపేశాడు. వివరాలిలా.. 61వ వార్డు మల్కాపురం సమీపాన గల వెంకన్నపాలెం కొండ ప్రాంతం వద్ద సులభ్ కాంప్లెక్స్ పక్కన సర్వే నంబర్ 10/10లో కొంత ప్రభుత్వ స్థలం ఉంది. దానిలో 40 గజాల్లో షెడ్ నిర్మించేందుకు ఈ స్థలానికి ఆనుకుని నివసిస్తున్న వ్యక్తి శుక్రవారం పనులు ప్రారంభించాడు. స్థలాన్ని చదును చేసి పునాదులు నిర్మించాడు. విషయం తెలుసుకున్న స్థానిక యాదవ్ యూత్ శనివారం ఉదయం అక్కడికి వెళ్లి ప్రభుత్వ స్థలంలో అనధికార నిర్మాణం ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. స్థలం ఖాళీగా ఉండటంతో తన కార్ కోసం తాత్కాలికంగా షెడ్ వేస్తున్నానన్నాడు. తాత్కాలిక షెడ్ అయితే పునాదులు ఎందుకు తవ్వారని ప్రశ్నించగా.. పొంతన లేని సమాధానాలు చెప్పాడు. పనులు ఆపాలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని యువత అనడంతో సదరు వ్యక్తి పనులను నిలిపివేశాడు.

చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ఈ ఘటనపై ములగాడ మండల రెవెన్యూ కార్యాలయ తహసీల్దార్ డి.వీరభద్రరావును 'సాక్షి' వివరణ కోరగా.. ఆ ప్రాంతానికి సిబ్బందిని పంపి సమస్య తెలుసుకుంటామన్నారు. ప్రభుత్వ స్థలంలో అనధికార నిర్మాణం చేపడితే తప్పక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో శనివారం మహిళలకు జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు చీరలు పంపిణీ చేశారు. 460 సచివాలయం పరిధి వెంకటాపురానికి చెందిన ఆర్పీలు, వలంటీర్లకు, గృహసారథులకు వాటిని అందించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, కంపర కోటేశ్వరరావు, కనకరాజు, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న పిలక రామ్మోహనరెడ్డి

సింథియా: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లోని కొండవాలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఇటీవల పశ్చిమ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆదారి ఆనంద్‌కుమార్ రక్షణగోడల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డును అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్న ప్రసాద పథకానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. నగరంలోని దుర్గానగర్‌కు చెందిన సంగు ఆంజనేయరెడ్డి లక్ష 1116 రూపాయిలు అందజేశారు. దాతకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అన్నప్రసాద బాండ్ అందజేశారు.

- హనుమంతవాకకు చెందిన ఎం.అప్పలనాయుడు, సత్యంనాయుడు అనే దాతలు లక్ష 116 రూపాయిల విరాళం అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు సూపరింటెండెంట్ కనకరాజు అన్న ప్రసాద బాండ్ అందజేశారు. పీఆర్వో నాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా రాంభట్ల



సీతంపేట: ఈ నెల 10 నుంచి ప్రారంభమైన తిరుచానూరు పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలకు వ్యాఖ్యాతగా విశాఖకు చెందిన కవి, వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మకు అవకాశం దక్కింది. 15వ తేదీ సాయంత్రం 4 నుంచి 5.30 వరకు స్వర్ణ రథం, రాత్రి 7 నుంచి 9 వరకు గరుడ వాహనం, 16న ఉదయం 8 నుంచి 10 వరకు సూర్యప్రభ వాహనోత్సవాలకు ప్రత్యక్ష వ్యాఖ్యానం చేయనున్నారు. శ్రీవెంకటేశ్వర స్వామి భక్తి చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసే ఈ బ్రహ్మోత్సవాలకు ఇలాంటి అవకాశం రావడం ఇది పన్నెండో సారని రాంభట్ల తెలిపారు.

వెంగళరావు కుటుంబానికి కార్మికుల పరామర్శ



కొల్లాబత్తుల రమణమ్మ, ప్రసన్నలను పరామర్శిస్తున్న పారిశుధ్య కార్మికులు

కంచరపాలెం: ఇటీవల మృతి చెందిన మాజీ కార్పొరేట ర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దళిత నాయకుడు కొల్లాబత్తుల వెంగళరావు కుటుంబ సభ్యు లు భార్య రమణమ్మ, కుమార్తె ప్రసన్నలను 54వ వార్డు 104 ఏరియాలోని స్వగృహంలో శనివారం 47, 48 వార్డులకు చెందిన పారిశుధ్య కార్మికులు పరామర్శించారు. వెంగళరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు సవరపు జయకుమార్ మాట్లాడుతూ వెంగళరావు పెట్టిన భిక్షతో నేడు సుమారు 40 మంది పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిక్కొలు అప్పారావు, పోతల రాజు, యల్లబిల్లి నూకరాజు, నాగరాజు, బాబురావు, చండీ, అప్పలకొండ, అనసూయ, మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక పరివర్తన

మురళీనగర్: విద్యతోనే సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని ప్రవచించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయుడని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం కాలేజీలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడమే కాకుండా సామాజిక బాధ్యతతో మెలగాలన్నారు. ముందుగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కెమికల్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, అధ్యాపకులు కుమార్, కుమారి, జ్యోతి, ఇన్‌చార్జి ఓఎస్ సాయి లక్ష్మి పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.